


పనులకు అజమాయిషీ చేస్తూ పురమాయించడం తనకు నచ్చలేదు.

"మేనేజరుకు హోదా ఎంత అవసరం అని అతను అనుకుంటున్నాడో అలాగే గుమాస్తాలకూ, పి.ఏ.లకు కూడా హోదా వుందని తెలుసుకో వద్దూ..." అనుకున్నాడు బ్రహ్మానందం.

మరో ఏడాది తిరిగింది.

మేనేజరు ట్రాన్స్‌ఫరయ్యాడు.

పీడ విరగడైందనుకుని సహ గుమాస్తాలకు ఒక పార్టీ ఇచ్చాడు బ్రహ్మానందం.

కొత్త మేనేజరు జాయినయ్యాడు.

పాత మేనేజరుకీ, కొత్త మేనేజరుకీ పోలికలే లేవు. అతి నెమ్మదస్తుడు. అవసరమయితేనే ప్యూన్‌లను పిలుస్తాడు. అజమాయిషీ చెయ్యడు. ఆఫీసు కారు ఇంటికి తిప్పడు. ఇంటి పనులు ఆఫీసుకు పట్టుకు రాడు. ఇంట్లో ఉండే టూరుకు వెళ్తున్నానని చెప్పడు. ఇలా చాలా నిజాయితీగా ప్రవర్తించే వాడు ఆయన.

బ్రహ్మానందం ఆరోగ్యం బాగా అభివృద్ధి చెందింది. మొహం కళకళ లాడేది. మళ్ళీ తనో చిన్న కుర్రాడిలా మారుతున్నాడు.

ఒక రోజు మేనేజరు బ్రహ్మానందాన్ని పిలిచి-

"మిస్టర్ బ్రహ్మం...నేను గంట పర్మిషన్‌లో పోతున్నాను. మా ఇంట్లో గ్యాస్ చెడి పోయింది. వాళ్ళతో మాట్లాడి రావాలి. కాస్త హెడ్డాఫీసు ఫోన్లు వస్తే నేను పర్మిషన్‌లో వెళ్ళానని చెప్పండి..." అన్నాడు. క్షణం తటపటాయించి.

"సార్! ఈమాత్రానికి మీరు వెళ్ళాలా చెప్పండి. మీరు ఏమను కోక పోతే నేను వెళ్ళొస్తాను సార్." అన్నాడు బ్రహ్మానందం.

"నో!నో! ఇది నా పర్సనల్ వర్క్...దీన్ని మీరు చెయ్యడం బాగుండదు" అన్నాడు మేనేజరు.

అయినా ఆయన మంచితనం బ్రహ్మానందాన్ని ఊరుకో నివ్వలేదు.

"ఫరవాలేదు సార్! ఇప్పుడు మీరు బాసు...నేను గుమాస్తాకాము సార్. మనిషికి మనిషి చేసే సాయం. మీరు పురమాయించ లేదు. అయినా నేను చేస్తాను. మీ టైం...విలువైనది. ఈ గంట కంపెనీకి ఉపయోగిస్తే అవి మీరే చెయ్యగలరు. నేను గ్యాస్ కంపెనీకి వెళ్తాను సార్" అన్నాడు.

అలాగే అప్పుడప్పుడూ కొత్త మేనేజరు తనకు తానుగా ఏ పనైనా చెయ్యాలను కున్నప్పుడు. బ్రహ్మానందం తను చేస్తానని ముందుకు వచ్చేవాడు.

పాత మేనేజరు ఏ పనులు చెప్తే విసుక్కుని కోప్పడేవాడో, ఆ పనులనే కొత్త మేనేజరు చెప్పక పోయినా తనే కల్పించుకుని చేసేవాడు.

ఈ తతంగాన్ని పరిశీలించిన సహ గుమాస్తాలు బ్రహ్మానందాన్ని నిలదీశారు.

"ఆ మేనేజరు అడిగినప్పుడు విసుక్కున్నావ్. ఈ మేనేజరంటే పడి చస్తున్నావ్ ఏమిట్రా కారణం" అని.

"ఉందిరా! కారణం. ఆయన అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని అజమాయిషీ చేసేవాడు. తన చేతిలో పవరుంది కనుక ఏమైనా చెయ్యొచ్చు అని తన క్రింది స్టాఫ్‌ను నీచంగా చూసేవాడు. కానీ ఈ మేనేజరు. తన అధికారాన్ని నా పక్ష ఎప్పుడూ ప్రదర్శించ లేదు. మనిషిని మనిషిగా ఉద్యోగంలో స్థాయిని బట్టి చిన్న చూపు చూడకుండా మానవత్వంతో ప్రవర్తించాడు. తన సొంత పనులు తనే చేసుకుందా మను కున్నాడు. కానీ మేనేజరు స్థానంలో ఉన్న ఆయన కాలం విలువైంది. ఆ విలువైన కాలాన్ని చిన్న పనులకు వృథా చేయడం ఎందుకని నేను చెయ్యడానికి ముందుకు వచ్చాను.

"మేనేజరు ఎవరైనా ఒక్కరే.

"కానీ పనులు పురమాయించడంలో అధికారం కన్నా...అభిమానం మనిషిని ఆకట్టుకుంటుంది. రాతిగుండె మనిషి కూడా అభిమానానికి దాసోహం అంటాడు. అలాగే నేనూ" అన్నాడు బ్రహ్మానందం.

అందరూ ఆశ్చర్యంగా నిలబడిపోయారు. ☆